జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM
సోమవారం
09 02 2026
సంపుటి 1 సంచిక 79
పేజీలు : 04
PRGI No :
TGTEL/25/A4195

దశ పత్రికలో పనిచేసేందుకు
జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు
కావలెను. సీనియర్ రిపోర్టర్లకు
తగిన పారితోషికం
ఇవ్వబడును.
7337 54 6647
9848 28 8850

# కొత్తవి రావు.. పాతవి పోవు

## ఏ జిల్లాను తొలగించడం గానీ, కొత్త జిల్లాను ఏర్పాటు చేసే ఆలోచన చేయం

**సింగరేణి మెడికల్ బోర్డు రద్దు చేస్తారంటూ కొందరు తప్పుడు, విష ప్రచారం**

**"ప్రజా పాలన - ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**'సమ్మక్క - సారలమ్మ జిల్లా మహిళా సమాఖ్య'కు 205 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును అందజేత**



**దశ, జయశంకర్ భూపాలపల్లి:**

కొన్ని జిల్లాలను రద్దు చేస్తారని, సింగరేణి మెడికల్ బోర్డును రద్దు చేస్తారంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వయంగా స్పష్టతనిచ్చారు. ఏ జిల్లాను తొలగించడం గానీ, కొత్త జిల్లాను ఏర్పాటు చేసే ఆలోచనగానీ ప్రభుత్వ పరిశీలనలో లేదన్నారు. సింగరేణి మెడికల్ బోర్డు రద్దు చేస్తారంటూ కొందరు తప్పుడు, విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. అలాంటి ఆలోచనలే ప్రభుత్వం చేయడం లేదని స్పష్టం చేశారు. "ప్రజా పాలన - ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ, సింగరేణి మెడికల్ బోర్డు అంశాలపై స్పష్టతనిచ్చారు.

"జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారంటూ తప్పుడు విష ప్రచారం చేస్తున్నారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలకు స్పష్టంగా చెప్పదలుచుకున్నా. ఏ జిల్లాను తొలగించడం గానీ, కొత్త జిల్లాను ఏర్పాటు చేసే ఆలోచన గానీ ప్రభుత్వ

..మిగతా 4వ పేజీలో →



# ఆధారాలు ఆహుతి కాలేదు

## కీలకమైన కేసుల ఆధారాలు కాలిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదు :సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్

**దశ, హైద్రాబాద్**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో జరిగిన అగ్నిప్రమాదంపై అనుమానాలు సామాజిక మాధ్యమాలలో హల్చల్ చేస్తున్నాయి. తెలంగాణ ఫోరెన్సిక్ ల్యాబ్ బిల్డింగ్ మొదటి ఫ్లోర్లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద ఘటనలో చాలా విలువైన హార్డ్ డిస్క్ లు, డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో కీలక కేసుల ఆధారాలు బుగ్గిపాలు ఓటుకు నోటు కేసు వీడియో, ఆడియో ఫైల్స్ తో పాటు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసు, అలాగే సంచలనం సృష్టించిన ఫోన్ టాపింగ్ కేసుకు సంబంధించిన డేటా, హార్డ్ డిస్క్ లు ఇక్కడే ఉన్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. కీలక కేసులలో ఆధారాలు బుగ్గిపాలయ్యాయి అని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న వేళ, ఈ అగ్ని ప్రమాదం కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మరిన్ని కనుగొనండి నగరం గైడ్లు బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ టీవీ టెలివిజన్ సినిమా సమీక్షలు ఆటోమొబైల్స్ సేవలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన ఎఫ్ఎస్ఎల్ ఇన్స్పెక్టర్ ఈ ఘటనపైన ఎఫ్ఎస్ఎల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మొదట ప్రాపర్టీ రూమ్ లో భారీగా నల్లపొగతో కూడిన మంటలు వచ్చాయన్నారు. ఆ తర్వాత మంటలు ఇతర గదులకు కూడా వ్యాపించాయన్నారు. కంప్యూటర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ప్రాపర్టీ రూమ్, కేసు వెరిఫికేషన్ ఛాంబర్, సర్వర్ రూమ్, అనాలసిస్ ఛాంబర్, హెచ్ఆర్డి హాల్ తో పాటు ఫర్నిచర్, పరికరాలు అగ్నిప్రమాదంలో కాలిపోయాయని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో వార్తలపై సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ ప్రమాదం జరిగిన తర్వాత జీరో ఎఫ్ఐఆర్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, తన ఫిర్యాదు ఆధారంగా పోలీసు అధికారులు దర్యాప్తు జరుపుతున్నారని ఎఫ్ఎస్ఎల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మరోవైపు నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్లో జరిగిన అగ్నిప్రమాదంపై

..మిగతా 4వ పేజీలో →

## సూర్యాపేట పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

**దశ, సూర్యాపేట:** సూర్యాపేట పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని శక్తి సూపర్ షి స్టేట్ కో ఆర్డినేటర్ విద్య రెడ్డి అన్నారు. ఈ నెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పలు వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, పట్టణాల అభివృద్ధి కై కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం పలు వార్డులలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

# అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం: కేటీఆర్

**దశ, తాండూర్:** ఉద్యోగాల పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందిరా చౌక్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల్ని మోసం చేశారని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. రేవంత్ పాలనలో యూరియా కష్టాలు తప్పడం లేదని అన్నారు. చెప్పులు క్యూలైన్లలో పెట్టి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ యూరియా కొరత లేదని మండిపడ్డారు. రైతుబంధు అడిగితే.. లాగులో తొండలు విడుస్తానని అంటున్నాడని విమర్శించారు. రెండున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి లేక ప్రజలు గోసపడుతున్నారని తెలిపారు. బతుకమ్మ చీర లేదు.. కేసీఆర్ కిట్ లేదని విమర్శించారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని బోగస్ మాట చెప్పిందని మండిపడ్డారు. ఫిబ్రవరి 8వ తేదీకి కూడా రైతుబంధు పడలేదని తెలిపారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని మోసం చేశాడని అన్నారు. అత్తకు, కోడలికి ఇద్దరికీ రూ.2500 ఇచ్చిండా అని ప్రశ్నించారు. తులం బంగారం, రూ.4వేల పింఛన్, విద్యా భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, స్కూటీలు ఇస్తామని అనేక హామీలు ఇచ్చిండని అన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలు నమ్మి ప్రజలు మోసపోయిండని అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి అభయహస్తం చూపారని.. అది అభయహస్తం కాదని.. భస్మాసుర హస్తమని అన్నారు. హామీలపై నిలదీస్తే కేసులు పెడుతున్నారని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడమని స్పష్టం చేశారు. 420 హామీలు అమలయ్యే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అబద్ధాలాడి అయినా గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. మొదటిసారి మోసం చేస్తే తప్పు ఎదుటి వారిదవుతుంది.. రెండోసారి మోసపోతే తప్పు మనది అవుతుందని అన్నారు.



# వైట్ వాటర్ కన్స్ట్రక్షన్స్ రూ. 270 కోట్ల భారీ స్కాం



**దశ, హైదరాబాద్:** కూకట్పల్లిలో రియల్ ఎస్టేట్ పేరుతో పలువురు బాధితులను వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ సంస్థ మోసం చేసింది. బాధితులు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లోని ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అధికారులకి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో ఈ సంస్థపై అధికారులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్పల్లి వై జంక్షన్ సమీపంలో వైట్ వాటర్స్ పేరుతో అపార్ట్మెంట్ ప్రాజెక్ట్ను చేపట్టిన ఈ సంస్థ, వందలాది మంది కొనుగోలుదారులను నిలువునా ముంచింది. సుమారు 500 మంది కస్టమర్ల నుంచి దాదాపు రూ. 270 కోట్లు వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. పదేళ్లుగా ఈ ప్రాజెక్ట్ పేరుతో డబ్బు వసూలు చేశారని ఫిర్యాదులో తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ యజమాని అజయ్పై సైబరాబాద్ ఈ ఓ డబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవిత కాల కష్టాన్ని ప్లాట్ల కోసం పెట్టుబడిగా పెట్టామని తమకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించి తమ డబ్బును తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్

## పాడి గేదెల పేరుతో భారీ సైబర్ మోసం

**దశ, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో పాడి గేదెల పేరుతో భారీ సైబర్ మోసం జరిగింది. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన చాకలి రమేశ్ అనే రైతు నుంచి సైబర్ కేటుగాళ్లు రూ.8.84 లక్షలు కాజేశారు. రైతు రమేశ్ యూట్యూబ్లో రీల్స్ చూస్తున్న సమయంలో, తక్కువ ధరకు పాడి గేదెలను హోమ్ డెలివరీ చేస్తామంటూ ఓ పోస్ట్ కనిపించింది. ఆ పోస్ట్లో ఉన్న సెల్ నెంబర్కు కాల్ చేయగా, అవతలి వ్యక్తులు నమ్మకంగా మాట్లాడి డీల్ ఖరారు చేసినట్లు సమాచారం. పాడి గేదెలను హోమ్ డెలివరీ చేయడం కోసం ఆన్లైన్లో డబ్బులు పంపాలని సదరు రైతుకు ఓ లింక్ను పంపించారు. వారి మాటలు నమ్మిన రైతు రమేశ్.. విడతలవారీగా మొత్తం రూ.8.84 లక్షలు పంపించాడు. డబ్బులు పంపిన తర్వాత కూడా పాడి గేదెలు హోమ్ డెలివరీ కాకపోవడంతో రైతు రమేశ్ అవతలి వ్యక్తికి ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి, సైబర్ మోసం కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ప్రజలకు సూచనలు జారీ చేశారు. సోషల్ మీడియా, యూట్యూబ్ పోస్టులను నమ్మి డబ్బులు పంపొద్దని సూచించారు. తక్కువ ధర, హోమ్ డెలివరీ అంటూ వచ్చే ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకుండా ఉండాలని పోలీసులు సూచించారు.

## అగ్నిప్రమాదం వెనుక కేటీఆర్ హస్తం: ఎంపీ చామల

**దశ, హైదరాబాద్:** కేటీఆర్ తన స్థాయిని దిగజార్చుకున్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం జరిగితే దాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేసుకు ముడిపెట్టి కేటీఆర్ మాట్లాడారని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు మరోసారి బిఆర్ఎస్ వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ కు అర్థం అయింది. రేవంత్ రెడ్డిపై విష ప్రచారం చేస్తే ఓట్లు వస్తాయని కేటీఆర్ చిల్లర ప్రచారం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ టేపులు, ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన వివరాలు ఫోరెన్సిక్ ల్యాబ్ లో ఉన్నాయి. ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం వెనుక కేటీఆర్ హస్తం ఉంది ఏమోనని నాకు అనుమానం కలుగుతోంది. అందుకే ముందే వచ్చి కేటీఆర్ రేవంత్ రెడ్డిపై అబాండాలు వేశారని అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగానే ఎస్.ఐ.బి.ఆఫీస్ లో సీసీ కెమెరాలు బంద్ చేసి ఇజ్రాయిల్ నుంచి తెచ్చిన పరికరాలు, ఫైల్స్ మొత్తం ధ్వంసం చేశారు. మూసీ నదిలో పారేశారని అన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వెనుక కుట్ర ఉంటే అది కేటీఆర్ వైపు నుంచే ఉంటుంది. ఫోన్ ట్యాపింగ్ అంశంలో కేటీఆర్ కుటుంబం విచారణ ఎదుర్కొంటుంది. నువ్వు నీ బావ ఇద్దరూ కలిసి పొద్దున ఒకరు, మధ్యాహం ఒకరు, సాయంత్రం ఒకరు ప్రెస్ మీట్, ట్విట్టర్, చిట్ ఛాట్ పేరుతో ప్రజలను చీట్ చేస్తున్నారన్నారు.



## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లని రద్దు చేయాలి: సిపిఐ




**దశ, పెద్ద అంబర్ పేట :** దేశంలో కార్మికులు మరియు కార్మికుల చట్టాలు లేకుండా చేయాలనే లక్ష్యంతోనే పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక లేబర్ చట్టాలని తీసేసి అప్రజాస్వామికమైన నాలుగు లేబర్ కోడ్ లని కేంద్రం ప్రభుత్వం తెచ్చిందని వాటి రద్దు చేయాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారీ మరియు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2020లో తిసుకొచ్చిన నాలుగు అప్రజాస్వామిక లేబర్ చట్టాలని రద్దు చేయాలనే ప్రధానమైన డిమాండ్ తో కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెక పిలునిచ్చాయి.ఆ సమ్మెకి సంబందించిన వాల్ పోస్టర్ ని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన ఆదివారం నాడు రావి నారాయణ రెడ్డి కాలనీ ఫెజ్ 2 సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై అందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి మొదలు నేటి వరకు పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు మరియు కార్మిక వ్యతిరేక విధానాలనే అవాలంబిస్తుంది. అందులో భాగంగానే అనేకమంది కార్మికుల ప్రాణ త్యాగాల ద్వారా పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలని కరోనా సమయంలో రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు అప్రజాస్వామిక కోడ్ లని తెచ్చి పెట్టింది.అవి పూర్తిగా పెట్టుబడి దారులకి,బడ పారిశ్రామిక వేత్తలకి అనుకూలంగా ఉన్న చట్టాలు. వాటికీ వ్యతిరేకంగా పోరాడుతు నేటి వరకు వాటిని అమలు చేయకుండా కార్మిక సంఘాలు అడ్డుకున్నాయి. ఈ నెల 12 నాడు కార్మికలోకం అధిక సంఖ్యలో సమ్మెలో పాల్గొనాలని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, బిఓసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్,సిపిఐ మండల నాయకులు యేశాలి నర్సింహా,పొన్నాల యాదగిరి, డవుల రాములు, మంగళపల్లి రవి,సాయిలు, కాసిం, కురుమయ్య, ఈశ్వరయ్య,యాదగిరి,నన్నే సాబ్, జట్టి కాశి, బాలస్వామి,అశోక్,శోభన్ వెంకట్ రాములు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## కీచక టీచర్ కి దేహశుద్ధి

**దశ, నల్గొండ:** చింతపల్లి మండలం గొడుకొండ్ల ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థినిపై టీచర్ దేవుల లైంగిక దాడి జరిపాడు. గత కొంతకాలంగా గొడుకొండ్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో టీచర్ గా పనిచేస్తున్న దేవుల, నిత్యం మద్యం సేవించి వికృతి చేష్టలకు పాల్పడుతున్నాడని ఆరోపణ. ఓ నాలుగో తరగతి విద్యార్థినిపై లైంగిక దాడి చేయడంతో సార్ బాగోతం బట్టబయలు అయింది. దాంతో విద్యార్థిని తల్లిదండ్రులు రంగంలోకి దిగడంతో టీచర్ దేవుల కు దేహశుద్ధి జరిపారు. పోలీసులు వచ్చి కీచక టీచర్ ను అదుపులో తీసుకున్నారు.

## ఆధారాలు ఆహుతి కాలేదు

మొదటి పేజీ తరువాయి

సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖాగోయల్ తీవ్రంగా ఖండించారు.

### ఆ ప్రచారంలో వాస్తవం లేదు :శిఖా గోయల్.

ఆ ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్ కీలకమైన కేసుల ఆధారాలు కాలిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా 2015 నాటి ఏసీబీ కేసులో ఉన్న 16 వస్తువులను అప్పట్లోనే పరిశీలించి, 2021లో కోర్టుకు తిరిగి అప్పగించామని, ప్రస్తుతం ల్యాబ్‌లో ఆ కేసుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించారు. అలాగే పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో అందిన 136వస్తువులలో మెజారిటీ వస్తువుల రిపోర్ట్స్ ఇప్పటికే పంపామని, మిగిలినవి సురక్షితంగా ఉన్నాయని తెలిపారు. ఫైర్ ఆడిట్ నిర్వహించి విధులను పునరుద్ధరిస్తామన్న శిఖా గోయల్ ప్రమాదం జరిగిన వెంటనే సిబ్బంది అప్రమత్తం అవ్వడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. మధ్యాహ్నం 1:30 కల్లా మంటలు అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. త్వరలోనే ఫైర్ ఆడిట్ నిర్వహించి విధులను పునరుద్ధరిస్తామని, నిరాధారమైన పుకార్లను ఎవరూ నమ్మవద్దని శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# హైటెక్ హంగులతో నల్గొండ రైల్వే స్టేషన్

### అమృత్ భారత్ కింద తెలంగాణలో పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

**దశ, నల్గొండ**








అమృత్ భారత్ కింద తెలంగాణలో పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తెలంగాణలో అత్యంత రద్దీతో కూడుకున్న నల్గొండ రైల్వే స్టేషన్.. రూపు రేఖలు సమూలంగా మారిపోతున్నాయి. తెలంగాణ నుంచి ఏపీ మీదుగా దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే పలు రైళ్లకు హాల్ట్ సౌకర్యం ఉన్న స్టేషన్ ఇది. దీని ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపుగా పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. పునర్నిర్మాణం, ఆధునికీకరణ పనులు పూర్తయ్యాక.. చర్లపల్లి తరహాలో ఇప్పుడున్న వాటి కంటే అదనపు రైలు సర్వీసులు ఇక్కడ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. . సికింద్రాబాద్ సహా మలక్‌పేట్, మహబూబ్ నగర్, కామారెడ్డి, నిజామాబాద్, మల్కాజ్‌గిరి, ముద్ఖేడ్,ఆదిలాబాద్,రామగుండం,కరీంనగర్, మహబూబాబాద్, హైటెక్ సిటీ, హఫీజ్‌పేట్, జహీరాబాద్, తాండూరు, భద్రాచలం రోడ్, హుప్పుగూడ, యాదాద్రి, ఖాజీపేట్ జంక్షన్, మధిర.. వంటి రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ కింద అభివృద్ధి చేస్తోంది రైల్వే మంత్రిత్వ శాఖ. "కాకినాడ నుంచి అరుణాచలానికి ప్రత్యేక రైళ్లు: హాల్ట్ స్టేషన్లు" ఇప్పటికే సికింద్రాబాద్, యాదాద్రి, బేగంపేట్ వంటి రైల్వే స్టేషన్ల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి కూడా. 718 కోట్ల రూపాయల వ్యయంతో సికింద్రాబాద్ అభివృద్ధి పనులను చేపట్టారు. మూడు దశల్లో ఇవి పూర్తి కానున్నాయి. వచ్చే 40 సంవత్సరాల వరకు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎయిర్ పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మితం కానుంది. ఇంకో రెండేళ్లల్లో పూర్తి స్థాయిలో ఇది అందుబాటులోకి రానుంది. ఇప్పుడిదే జాబితాలో నల్గొండ రైల్వే స్టేషన్ చేరింది. 17 కోట్ల రూపాయల వ్యయంతో దీని పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 90 శాతం పూర్తయ్యాయి. ప్లాట్‌ఫారాలపై షెల్ల నిర్మాణం, విస్తరణతో పాటు సీటింగ్, మంచినీటి వసతి వంటి అదనపు సౌకర్యాలు కల్పన పనులు ముగిశాయి. లిఫ్టులు, అప్రోచ్ రోడ్డు, పార్కింగ్, సర్కులేటింగ్ ఏరియా, దివ్యాంగుల సౌకర్యాల వంటివి నిర్మితం అయ్యాయి. కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. ప్రస్తుతం 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి. వెయిటింగ్ హాల్స్ పునరుద్ధరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇక్కడ ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

## గజ్వేల్ లో మంత్రి వివేక్ ప్రచారం



**దశ,గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి వివేక్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్చార్జ్ కూన శ్రీశైలం గౌడ్,డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మహిళల స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసంరాష్ట్ర వ్యాప్తంగా 21 వేల కోట్ల రూపాయలు కేటాయించామనివెల్లడించారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా 50 కోట్ల రూపాయలతో ఆధునిక ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. గత సంవత్సరం గజ్వేల్‌లో 3500 ఇండ్లు మంజూరు చేసి అందించామని, ఈ సంవత్సరం కూడా ఇల్లు లేని పేదల కోసం మళ్లీ 3500 ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి వివేక్ ప్రజలను కోరారు.

# ఐసీసీ vs పీసీబీ వార్‌లోకి బంగ్లాదేశ్ సడెన్ ఎంట్రీ!

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026లో భారత్ పాకిస్తాన్ మ్యాచ్ చుట్టూ నెలకొన్న వివాదం మరింత ముదిరుతోంది. బంగ్లాదేశ్ జోక్యంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఫిబ్రవరి 15న జరగాల్సిన భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్తాన్ నిర్ణయం తీసుకోవడంతో, అంతర్జాతీయ క్రికెట్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం బుల్‌బుల్ లాహోర్‌కు వెళ్లాడు. అక్కడ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధికారులతో కీలక సమావేశం జరగనుంది. ఇదే సమయంలో ఇద్దరు ఐసీసీ అధికారులు కూడా లాహోర్‌కు చేరుకుంటున్నారు. ఈ భేటీలపై క్రికెట్ ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

మొదటగా బంగ్లాదేశ్ ప్రభుత్వం భద్రతా కారణాలు చూపుతూ భారత్‌లో జరిగే తమ గ్రూప్ మ్యాచ్‌లకు వెళ్లేందుకు నిరాకరించింది. మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బీసీబీ ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. అయితే స్వతంత్ర భద్రతా పరిశీలన తర్వాత ఐసీసీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. నిర్ణీత గడువు లోపు బంగ్లాదేశ్ అంగీకారం తెలపకపోవడంతో, టోర్నమెంట్ నుంచి తొలగించి వారి స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చింది. ఈ నిర్ణయానికి మద్దతుగా పాకిస్తాన్ ముందుకు వచ్చింది. బంగ్లాదేశ్‌ను తొలగించడం అన్యాయమని, రాజకీయ ఒత్తిళ్ల వల్లే ఇలా జరిగిందని పాకిస్తాన్ పేర్కొంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాల మేరకు భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్తాన్ జట్టు నిర్ణయం తీసుకుంది. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ కూడా ఇదే విషయాన్ని బలంగా సమర్థించారు. భారత్-పాకిస్తాన్ మ్యాచ్ టోర్నమెంట్‌లో అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టే మ్యాచ్ కావడంతో, ఐసీసీ తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఈ మ్యాచ్ రద్దయితే టోర్నమెంట్ ప్రతిష్టకు భారీ దెబ్బ తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే పాకిస్తాన్‌కు ఐసీసీ హెచ్చరికలు జారీ చేసింది. మ్యాచ్ ఆడకపోతే భారీ జరిమానాలు, పాయింట్ల కోత, భవిష్యత్ టోర్నమెంట్‌ల నిర్వహణ హక్కుల కోల్పోవడం వంటి చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

## లాస్ట్ ఓవర్ హైడ్రామా.. గెలిచిన ఇంగ్లండ్



ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు నేపాల్‌పై నాలుగు పరుగుల తేడాతో గెలిచింది. చివరి ఓవర్‌లో పది పరుగులు అవసరమైన సమయంలో సామ్ కరన్ అద్భుతంగా బౌలింగ్ చేసి కేవలం ఐదు పరుగులే ఇచ్చి జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో నేపాల్ మరోసారి స్వల్ప తేడాతో ఓటమి పాలైంది.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 184 పరుగులు చేసింది. జేకబ్ బెథెల్ (55), హ్యారీ బ్రూక్ (53) అర్ధశతకాలతో జట్టుకు బలమైన స్కోరు అందించారు. చివరి ఓవర్‌లో విల్ జాక్స్ 18 బంతుల్లో 39 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి ఇంగ్లండ్ స్కోరును మరింత పెంచాడు. కరణ్ కేసీ వేసిన చివరి ఓవర్‌లో 21 పరుగులు రావడం మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది.

ఈ ఓటమితో నేపాల్ మరోసారి స్వల్ప తేడాతో టోర్నమెంట్‌లో నిరాశకు గురైంది. గత ఎడిషన్‌లో దక్షిణాఫ్రికాపై ఒక్క పరుగు తేడాతో ఓడినట్టే, ఈసారి కూడా దగ్గరలోకి వచ్చి విజయం చేజార్చుకుంది. ఇంగ్లండ్ మాత్రం ఈ గెలుపుతో టోర్నమెంట్‌లో కీలక విజయాన్ని నమోదు చేసి, నాకౌట్ దశకు చేరువైంది.

# కొత్తవి రావు.. పాతవి పోవు

మొదటి పేజీ తరువాయి

పరిశీలనలో లేదు. ఎక్కడైనా జిల్లాల్లో పునర్వ్యవస్థీకరించాలి లేదా రేషనలైజేషన్ చేయాలంటే బహిరంగంగా ప్రజలకు చెప్పి శాసనసభలో చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతనే జిల్లాల గురించి ఆలోచనలు చేస్తాం. కార్పొరేట్ మెడికల్ బోర్డును రద్దు చేస్తుందని, వారసత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పోతాయని కొందరు తప్పుడు, విష ప్రచారం చేస్తున్నారు. అసలు ఈ ఆలోచనలు ఎక్కడి నుంచి వచ్చాయో అర్థం కావడం లేదు. సింగరేణి మెడికల్ బోర్డు రద్దు చేయాలన్న ఆలోచనే ప్రభుత్వం చేయడం లేదు. సింగరేణి గని కార్మికులు తమ భుజాలపై మోసి ఈ ప్రభుత్వాన్ని నిలబెట్టారు" అని ముఖ్యమంత్రి విడమరిచి చెప్పారు. 2027లో నిర్వహించబోయే పుష్కరాల గురించి ముఖ్యమంత్రి గారు వివరిస్తూ, ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని బాసర నుంచి భద్రాచలం వరకు ప్రతి ఆలయాన్ని పర్యాటక పుణ్యక్షేత్రాలుగా తీర్చిదిద్దుతాం. అటవీ ప్రాంతాల్లో రిసార్టులను నిర్మించి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. గతేడాది సరస్వతి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించుకున్నాం. అలాగే, వెయ్యేండ్లు గుర్తుండే విధంగా మేడారంను తీర్చిదిద్దుకుని సమ్మక్క - సారలమ్మ జాతరను దక్షిణ కుంభమేళాగా గొప్పగా నిర్వహించాం. మేడారం జాతరకు 2 కోట్ల మంది దర్శించుకున్నారు" అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కొండా సురేఖ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ బహిరంగ సభ వేదిక నుంచి ముఖ్యమంత్రి 'సమ్మక్క సారలమ్మ జిల్లా మహిళా సమాఖ్య'కు 205 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు.




Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com